క్లుప్తంగా

విస్సన్నపేటలో జేసీ పర్యటన

విస్సన్నపేట: ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ఆదివారం విస్సన్నపేటలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో యూరియా, డీఏపీ సరఫరా చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ఆర్డీఓ మాధురి, తహసీల్దార్ కె లక్ష్మికల్యాణి, ఆర్ఐ సుజాత, ఈఓ హరికృష్ణ కుమార్, సొసైటీ అధ్యక్షుడు బద్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు



తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్లో బెల్టు దుకాణాలపై ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. బెల్టు దుకాణాలు నడుపుతున్న ఎ.కొండూరు మండలం చీమలపాడుకు చెందిన మాడుగుల మణిదీప కృష్ణ వద్ద 13 మద్యం సీసాలు, ఎ.కొండూరులో బాణావతు ధర్మ వద్ద 15 బాటిల్స్, రామచంద్రాపురంలో మరీదు చెన్నారావు వద్ద 19, తిరువూరు మండలం లక్ష్మీపురంలో వేముల సుజాత వద్ద 12 బాటిళ్లు, వేముల చిన్న నరసింహారావు నుండి 8 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామశేషయ్య తెలిపారు.

నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

నూజివీడు: నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని నూజివీడు సాధన సమితి గౌరవాధ్యక్షుడు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని అమర్‌భవన్‌లో ఆదివారం సాధన సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతానని చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్, కలెక్టర్‌లకు వినతిపత్రాలను అందజేయాలని సాధన సమితి నాయకులు నిర్ణయించారు. నూజివీడు సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన



జూపూడి(ఇబ్రహీంపట్నం): ఈనెల రెండున జూపూడి భీమేశ్వర కాలనీలోని ఓ ఇంట్లో జరిగిన బ్లాస్టింగ్ ఘటనలో చికిత్స పొందుతూ మృతిచెందిన గోదా గోపి (29) కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, కోనాయపాలెం గ్రామస్తులు పేలుడు జరిగిన ఇంటి వద్ద ఆదివారం ఆందోళనకు దిగారు. మృతుడి భార్య, ఇద్దరు పిల్లలకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సుబాబుల్ తోటల్లో కూలి పనులు చేసుకునే గోపి వెల్డింగ్ మేస్త్రి పిలిచాడని ఆ రోజే హెల్పర్‌గా పనికి వచ్చి ప్రాణాలు కోల్పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. గోపి మృతితో భార్యా, పిల్లలు దిక్కులేని వారయ్యారన్నారు. వారి భవిష్యత్‌కు పాలకులు, ప్రభుత్వ పెద్దలు దారి చూపాలని విన్నవించారు. అక్కడకు చేరుకున్న సీఐ చంద్రశేఖర్ ఇరువర్గాలకు సర్దిచెప్పి ఆందోళనను విరమింపజేశారు

బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులు


తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్‌లోని పలు గ్రామాల్లో బహిరంగ మద్యపానం చేసే వారిపై అధికారులు ఆదివారం కేసులు నమోదు చేశారు. ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ నిక్సన్ తెలిపారు. ఎ.కొండూరు మండలంలో 5, గంపలగూడెం మండలంలో 3, తిరువూరు మండలంలో 3, విస్సన్నపేట మండలంలో ఒక బెల్టు దుకాణంపై కేసు నమోదు చేసి 125 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు వెంకటకుమార్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



రెడ్డిగూడెం (జి.కొండూరు): ఇటీవల వచ్చిన వరదలకు మద్దులపర్వ నుంచి కూన పురాజుపర్వ వెళ్లే రహదారిలో కల్వర్టు వద్ద కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. ఈ గుంతను పూడ్చకుండా అలానే వదిలివేయడంతో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ రహదారిలో రెండు గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు.

వెంటాడుతున్న వంతెన కష్టాలు



చెర్వుమాధవరం గ్రామం వద్ద పులివాగు వంతెనకు ఒక వైపు వరదకు కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు



వంతెన అప్రోచ్ కొట్టుకుపోవడానికి కారణమైన చెక్‌డ్యామ్ గండి

- పులివాగు వరదకు కొట్టుకుపోయిన లో లెవెల్ వంతెన అప్రోచ్ రోడ్డు
- సాగు భూములకు పోయే దారి లేక చెర్వుమాధవరం గ్రామస్తుల నరకయాతన

జి.కొండూరు: ఒక వైపు గ్రామం, మరో వైపు వ్యవసాయ భూములు, మధ్యలో పులివాగు వెరసి దశాబ్దాలుగా ఆ గ్రామ రైతుల కష్టాలు వర్ణనాతీతం. వరద వస్తే వ్యవసాయ పనులకు వెళ్లేందు ప్రాణాలను సైతం పణంగా పెట్టి వాగులో నడక సాగించిన ఆ గ్రామ రైతుల కష్టాలకు గత ప్రభుత్వం తెరదించింది. ట్రైబల్ సబ్ ప్లాన్ నిధుల నుంచి రూ.25 లక్షలతో లోలెవెల్ వంతెనను నిర్మించారు. ఈ వంతెన మీదుగా కొంతకాలం రాకపోకలు సాఫీగా సాగినప్పటికీ గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదలకు అప్రోచ్ కొంతమేర కొట్టుకుపోవడంతో మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులో వరద ఉధృతి ఎక్కువై అప్రోచ్ రోడ్డు మరోసారి కొట్టుకుపోవడంతో రైతులకు మరలా కష్టాలు ప్రారంభమయ్యాయి. అప్రోచ్ కొట్టుకుపోయి రోజులు గడుస్తున్నా పునర్నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో రైతులు వాగులో నడకమార్గాన సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది.

సాగు ప్రశ్నార్థకం

చెర్వుమాధవరం, మునగపాడు గ్రామాలకు చెందిన మూడు వందల ఎకరాలకు పైగా సాగు భూమి పులివాగుకు అవతలివైపు ఉండడంతో దారిలేక సాగు ప్రశ్నార్థకంగా మారింది. వంతెన అప్రోచ్ లేకపోవడంతో వాగులో నుంచి నడిచి వెళ్లడం తప్ప మరే ఇతర మార్గం లేకపోవడంతో నరకయాతన పడుతున్నారు. ఇప్పటికే సాగు చేపట్టిన నేపథ్యంలో ట్రాక్టర్లు వెళ్లేందుకు వీలులేక రైతులు ఎరువులను తరలించడం, కూలీలను తరలించడం సమస్యగా మారింది. అధికారులు వెంటనే స్పందించి అప్రోచ్‌ను నిర్మించకపోతే ఖరీఫ్ సాగు కష్టంగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెక్‌డ్యామ్ గండి వల్లే సమస్య

చెర్వుమాధవరం గ్రామానికి ఆనుకొని పులివాగుపై నిర్మించిన లోలెవెల్ వంతెనకు పక్కనే ఉన్న చెక్ డ్యామ్ వద్ద గత ఏడాది పడిన గండిని పూడ్చకపోవడం వల్లే వంతెన అప్రోచ్ కొట్టుకుపోయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గండి నుంచి వరదంతా ఒక వైపు ప్రవహించడం వల్లనే అప్రోచ్ కొద్ది కొద్దిగా కోతకు గురై పూర్తిగా కొట్టుకుపోయిందని తెలుస్తోంది. ఒక వేళ అప్రోచ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ వాగు వెడల్పు ఉన్నంతవరకు ఎగువ వైపున కాంక్రీటు గోడను నిర్మించకపోతే మరలా సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పునర్నిర్మాణానికి రిపోర్టు పంపాం

చెర్వుమాధవరం వద్ద పులివాగుపై ఉన్న లోలెవెల్ వంతెనకు ఒక వైపు కట్ట తెగిన ప్రదేశాన్ని పరిశీలించి రిపోర్టు పంపాం. త్వరలో ఎస్టిమేషన్‌లు తయారు చేసి పంపుతాం. అనుమతి రాగానే కట్ట నిర్మాణంతో పాటు పక్కనే ఉన్న చెక్ డ్యామ్ గండిని కూడా పూడ్చే పనులు చేపడతాం.

– టి.రాజేష్, ఇరిగేషన్ ఏఈఈ, జి.కొండూరు

ఎరువుల కోసం ఆందోళన వద్దు

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



ఈలప్రోలులో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మండలంలోని ఈలప్రోలు గ్రామంలో జన జాగృతి కార్యక్రమంలో భాగంగా దివారం ఆయన పర్యటించారు. పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. పీఏసీఎస్‌కు చేరిన ఎరువులు, రైతులకు పంపిణీ చేసిన వివరాలు, మిగులు నిల్వలపై ఆరా తీశారు. బిల్లు బుక్కులు, ఈ–పాస్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, సహకార, మార్క్‌ఫెడ్ తదితర శాఖల అధికారులు రైతులకు ఎరువులపై అవగాహన కల్పించారు. రైతులు దశల వారీగా వినియోగించాల్సిన ఎరువులు, నానో యూరియా వాడకం, ప్రయోజనాలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. జిల్లాలో ప్రణాళికాబద్ధంగా ఎరువుల సరఫరా జరుగుతోందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. తహసీల్దార్ వై. వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి యడవల్లి రజని, ఏఈఓ వాసవి, సర్పంచి కరణం రంగారావు, రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరత తీరుస్తాం

తిరువూరు: ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా అన్నారు. ఆదివారం తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లోని పీఏసీఎస్‌లలో యూరియా సరఫరా తీరును ఆమె తనిఖీ చేశారు. ఖరీఫ్ పైర్ల సాగుకు యూరియా ఎంతమేరకు అవసరమో ఇండెంట్ పంపినందున త్వరలోనే స్టాకు వస్తుందని చెప్పారు. గంపలగూడెం, లక్ష్మీపురం, మాధవరం, రెడ్డిగూడెం, మల్లేల పీఏసీఎస్‌లలో రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తిరువూరు ఆర్డీఓ మాధురి, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.



తిరువూరు మండలం మల్లేల పీఏసీఎస్‌లో రైతులతో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా

ఆందోళన వద్దు..

జి.కొండూరు: యూరియాపై రైతులు ఆందోళన చెందవద్దని, రైతులకు అవసరమైన మేరకు పంపిణీ చేసేందుకు యూరియా సిద్ధంగా ఉందని విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య అన్నారు. వెలగలేరు సహకార సొసైటీలో యూరియా పంపిణీని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు అవసరం మేరకే యూరియాను వినియోగించాలని సూచించారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

- మైలవరం: మైలవరం మండలంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం పర్యటించారు. మండలంలోని చంద్రగూడెంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా నిరంతర పర్యవేక్షణతో యూరియా, ఇతర ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచుతుందన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కట్ట యూరియాతో సాగు ఎలా?

రెడ్డిగూడెం సహకార సొసైటీ వద్ద రైతుల ఆగ్రహం



రెడ్డిగూడెం సహకార సొసైటీ వద్ద యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు



ఆర్డీఓ కావూరి చైతన్యతో మాట్లాడుతున్న రైతులు

రెడ్డిగూడెం(జి.కొండూరు): ఒక కట్ట యూరియాతో సాగు చేయడం ఎలా అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్డిగూడెం సహకార సొసైటీలో అధికారులు ఆదివారం యూరియాను పంపిణీ చేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రైతులు పెద్దఎత్తున సహకార సొసైటీ వద్దకు చేరారు. గత కొన్ని రోజులుగా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు యూరియా బస్తాల కోసం పడిగాపులు పడ్డారు. రైతులు సాగు చేసే భూమితో సంబంధం లేకుండా ఒక్కొక్క రైతుకు ఒక్క యూరియా బస్తా మాత్రమే పంపిణీ చేయగలమని అధికారులు తేల్చి చెప్పడంతో రెడ్డిగూడెం సహకార సొసైటీ వద్ద రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్క బస్తా యూరియాతో ఎలా సాగు చేయాలంటూ అధికారులను ప్రశ్నించారు. స్టాకు రాగానే మరలా పంపిణీ చేస్తామంటూ అధికారులు రైతులకు నచ్చజెప్పి పంపారు.

స్టాకు రాగానే పంపిణీ చేస్తాం..

దీనిపై రెడ్డిగూడెం వ్యవసాయాధికారి డి.శ్రీనివాసరావుని వివరణ కోరగా రెడ్డిగూడెం సహకార సొసైటీలో 25 టన్నులు, రుద్రవరం సహకార సొసైటీలో 10 టన్నులు, కూనపరాజుపర్వ సహకార సొసైటీలో 15 టన్నులు, శ్రీరాంపురం సహకార సొసైటీలో 25 టన్నులు యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. ఇప్పటికే ఇండెంట్ పెట్టిన నేపథ్యంలో సోమవారం స్టాకు రాగానే రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందిస్తామని వివరించారు.

- మైలవరం: మైలవరం మండలం పుల్లూరు, చంద్రగూడెం గ్రామాలలో ఆదివారం విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య పర్యటించారు. రైతులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సొసైటీల్లో ఉన్న ఎరువులు, త్వరలో రానున్న ఎరువుల వివరాల సమాచారంతో పాటు పంట దశను బట్టి ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. నానో యూరియాను వినియోగించాలని చెప్పారు. రైతులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను తెలియజేద్దాం



ఊటుకూరులో క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న స్వామిదాసు, నాయకులు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు

తిరువూరు: ఏడాదిన్నర కాలంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గంపలగూడెం మండలం ఆర్లపాడు, గాదెవారిగూడెం, ఊటుకూరు, ఉమ్మడదేవరపల్లి గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. స్వామిదాసు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గెలుపు కోసం అలవికాని వాగ్దానాలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలకు రిక్తహస్తం చూపించిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ రూపొందించిన క్యూ ఆర్ కోడ్‌తో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలిపేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీ నాయకులు మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయలేని కూటమి ప్రభుత్వం

మాజీ మంత్రి జోగి రమేష్



ఇబ్రహీంపట్నంలో అన్నదాత పోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జోగి రమేష్, నాయకులు

ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం రైతులకు యూరియాను అందించలేని స్థితిలో ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ విమర్శించారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల తొమ్మిదిన ఆర్డీవో కార్యాలయాల వద్ద నిర్వహించే అన్నదాత పోరు వాల్‌పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. జోగి రమేష్ మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఎటూ ఇవ్వలేదని, పంటల సమయానికి కనీసం ఎరువులు కూడా అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఎన్నికల ముందు రైతులను బంగారంలా చూసుకుంటామని చెప్పి గద్దెనెక్కిన తర్వాత అన్నం పెట్టే రైతన్నలను అన్నం లేకుండా యూరియా కోసం క్యూలైన్‌లలో నిల్చునేలా చేసిన పాపం సీఎం చంద్రబాబుకు దగ్గుతుందన్నారు. గత వైఎస్సార్ సీపీలో ఐదేళ్లు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ఎరువులు అందుబాటులో ఉంచామని చెప్పారు. రైతును రారాజును చేశామన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 9న నందిగామ ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించే అన్నదాత పోరు నిరసనకు మైలవరం నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో రైతులు, నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సర్నాల తిరుపతిరావు, సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు రెంటపల్లి నాగరాజు, బయ్యారపు కిశోర్, జడ రాంబాబు, కుప్పిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా, నియోజకవర్గ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరువూరులో అన్నదాత పోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నవీన్ తదితరులు

రైతుల గోడు పట్టని ప్రభుత్వం

తిరువూరు: రైతుల సమస్యలను పెడచెవిన పెడుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తప్పక గుణపాఠం చెబుతారని వైఎస్సార్ సీపీ తిరువూరు మండల అధ్యక్షుడు తాళ్లూరి నవీన్‌కుమార్ అన్నారు. తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు యరమల రామచంద్రారెడ్డి, జిల్లా రైతు విభాగ ప్రధాన కార్యదర్శి ముక్కామల సీతారామయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు వెదురు గోపిరెడ్డి, తిరువూరు మండల ఉపాధ్యక్షుడు చెన్ను కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసీ



మహాసభలో మాట్లాడుతున్న చలసాని వెంకట రామారావు

నూజివీడు: ముఠా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ముఠా కార్మిక భవన్‌లో ఆదివారం నూజివీడు పట్టణ ముఠా కార్మికుల మహాసభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చలసాని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మిక హక్కులపై నిరంకుశ దాడులకు పాల్పడుతున్న కార్పొరేట్ వర్గాల తీరుపై ఉద్యమించడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని ప్రయత్నిస్తోందని, అదే జరిగితే కార్మికులు కట్టు బానిసలుగా మారిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. నూజివీడు ముఠా వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చలసాని వెంకట రామారావు, అధ్యక్షుడిగా ఎం. రాంబాబు, ఉపాధ్యక్షుడిగా పి. క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శిగా కె. దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శిగా పి. నాగేశ్వరరావు, కోశాధికారిగా టి. శ్రీరాములు, కమిటీ సభ్యులుగా జి.శ్రీనివాసరావు, కె. వెంకట్రావు, ఎ. సత్యనారాయణ, ఎం. సురేష్, కె. అవతారం, ఎస్.కన్నమ నాయుడు, కె. రామకృష్ణ, ఎం.లక్ష్మణరావు, ఎస్.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస డాంగే, ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో కవాటు బంధనం

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాల స్వామి దేవస్థానంలో చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం కవాటుబంధనం కార్యక్రమం జరిగింది. గ్రహణ సమయంలో ఆలయంలో భక్తులకు స్వామి వారి దర్శనాన్ని నిలిపివేస్తూ కవాటుబంధనం చేశారు. సోమవారం ఉదయం 9 గంటల తర్వాత సంప్రోక్షణ అనంతరం వేణుగోపాలస్వామి దర్శనం కల్పించనున్నట్లు అర్చకులు తెలిపారు.

వేణుగోపాలస్వామి మాస కల్యాణం

భాద్రపద శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం వేణుగోపాల స్వామి మాస కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో సంప్రదాయబద్ధంగా రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు నిర్వహించారు. పలువురు భక్తులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి సంధ్య పర్యవేక్షించారు.

మూతపడిన ఆలయాలు

చాట్రాయి: చంద్ర గ్రహణం సందర్భంగా ఆలయాలను మూసివేశారు. ఈ సందర్భంగా మండలంలోని చనుబండ కోదండ రామాలయం, చాట్రాయి, సి.గుడిపాడు, పోలవరం, తుమ్మగూడెం గ్రామాల్లోని శివాలయాలు, ఆరుగొలనుపేట గ్రామంలోని లక్ష్మమ్మ అంకమ్మ ఆలయాన్ని మూసివేశారు.

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ: సీపీఐ ఎంఎల్ లిబరేషన్

నూజివీడు: రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ రాజ్యం ఏలుతోందని, అభివృద్ధి, సంక్షేమం పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కార్పొరేట్లకు వేలాది ఎకరాలు కట్టబెట్టేందుకు ప్రజలపై ఖాకీలను ప్రయోగిస్తున్నారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. సెక్షన్ 30ని అమలు చేస్తూ ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛను హరించేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరును హైకోర్టు నిలువరించిందన్నారు. భూ సేకరణను వ్యతిరేకిస్తున్న రైతులకు మద్దతునిచ్చే వారిని సైతం కరేడు గ్రామంలో ప్రవేశించకుండా నిషేధపు ఉత్తర్వులు జారీ చేస్తున్న ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా హైకోర్టు అనుమతి నివ్వడం ప్రభుత్వానికి చెంపపెట్టన్నారు. నెల్లూరు జిల్లా కరేడు ప్రాంతంలో భూమినే నమ్ముకొని జీవిస్తున్న రైతులు ఆ గ్రామాన్ని ఖాళీ చేసి వెళ్లటానికి సిద్ధంగా లేరన్నారు. చంద్రబాబు కరేడు పరిధిలోని 4,912 ఎకరాలు సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసి పచ్చజెండా ఊపడం దారుణమన్నారు.

అవసరం మేర మాత్రమే యూరియా వాడాలి

చాట్రాయి: వరిసాగుకు తగినంత యూరియాను మాత్రమే వాడాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ అన్నారు. బూరుగుగూడెం సొసైటీలో యూరియా అమ్మకాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరి సాగుకు అధికంగా యూరియా వాడకూడదని, దీని వల్ల భూసారం తగ్గుతుందని చెప్పారు. ఇంతవరకు మండలంలోని సొసైటీల ద్వారా 850 మెట్రిక్ టన్నులు ఎరువులు రైతులకు అందించామన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుందని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందిస్తే సంబంధిత అధికారులకు పంపి గడువులోగా పరిష్కరిస్తామన్నారు.

రేపు వాహనాలకు వేలం

మైలవరం: మైలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 9వ తేదీన వేలం నిర్వహిస్తామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలకు అప్సెట్ ప్రైస్ నిర్ణయించి వేలం పాట జరుపుతున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు మైలవరం ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.